కథ

# మనసున మనసై

"మేడమ్ ! డిన్నర్ రాత్రి తొమ్మిదింటికి వస్తుంది !"

పి.ఏ సుధాకర్ సూట్‌కేసులు బెర్తుకిందకు తోస్తూ అన్నాడు.

చిన్నగా తల పంకించింది సుజాత !

"గుడ్‌నైట్ మేడమ్ !" అంటూ సుధాకర్ కదిలాడు.

సెకండ్ క్లాసు కంపార్టుమెంటు వైపు !

"సుధాకర్ ! మళ్లీ భోజనం టైముకు శ్రమపడి రాకండి !"

"ఓకే మేడమ్ !"

మల్టీమీడియా కంపెనీలో పనిచేస్తున్న సుజాత సెమినార్ కోసమని ఢిల్లీ నుంచి టాటానగర్ వచ్చింది. తిరుగుప్రయాణం ఫ్లైట్ దొరక్క ఫస్టుక్లాసులో రిజర్వ్ చేయించారు కంపెనీవాళ్లు. భోజనం రాగానే చేసి పడుకుంది సుజాత. ట్రైను మధ్యలో ఏదో స్టేషనులో ఆగి బయలుదేరుతుండగా హడావుడిగా ఒకతను సూట్‌కేసుతో కేబిన్ తలుపు తోసుకుంటూ లోపలికి వచ్చాడు.

అలికిడికి సుజాత చిన్నగా కదిలి కళ్ళు తెరిచింది !

అతన్ని చూడగానే ఆమె ఒక్క క్షణం దిగ్భ్రాంతి చెందింది !

"సిద్ధూ ! నువ్వేనా !" అస్పష్టంగా అంది.

అతను ఆమెను చూసి షాక్ అయ్యాడు !

"సుజి ! నువ్వేనా !" ఆశ్చర్యంగా, ఆవేదనగా అన్నాడు !

"సుజి ! ఎన్నాళ్లకు ? ఏమైపోయావు? నన్ను వదిలేసి ఎందుకు వెళ్ళిపోయావు ? ఆమె భుజాలు పట్టుకుని కుదిపేస్తూ ఉద్వేగంగా అన్నాడు.

"అయిదేళ్లైంది మనం విడిపోయి ? నువ్వేం అయిపోయావో అన్న దిగులుతో నేను ఎందుకు బతుకుతున్నానో నాకే తెలియదు. అయినా నాలో ఏదో వెర్రి నమ్మకం ! ఎప్పటికయినా మనం తిరిగి కలుస్తామని !" అతను ఆమెను వదలకుండా పట్టుకుని చెప్పుకుపోతున్నాడు, ఆనందంతో ! సుజాత కళ్ళల్లో నీళ్ళు చిప్పిల్లాయి.

అదే రూపం ! అవే మాటలు - అదే ప్రేమ - అయినా ఎంతెంత దూరాలు ? - ఇద్దరి మధ్యా ఎన్నెన్నో అగాధాలు ? సిద్ధార్థతో పరిచయం, కలిసి పెరగడం - గతం అంతా ఆమె కళ్లముందు కదలాడింది !

✿ ✿ ✿

"సిద్దూ ! మనకో కొత్త ఫ్రెండ్ !" ఉత్సాహంగా అంది శిల్ప. "సుజాత ! మా అత్తయ్య వాళ్ల అమ్మాయి !" అంటూ చూపించింది తనని. పొట్టిగౌను, రెండు పిలకలు - బెదురుతున్న చూపులతో ఎదురుగా ఉన్న చిన్న అమ్మాయి రూపం సిద్ధు మనస్సులో అప్పుడే శాశ్వతంగా ముద్రపడింది !

వారం రోజులు గడిచేటప్పటికి ఇద్దరు మంచి స్నేహితులయిపోయారు. ఓ రోజు సాయంత్రం ఆడుకుంటుంటే సిద్ధు వేసిన బంతి సుజాత తలకి గట్టిగా తగిలి రక్తం చిందింది.

"అమ్మ బాబోయ్! ఎంత రక్తమో ! మీ అమ్మవాళ్ళు నన్ను తిడతారేమో" సిద్ధు కంగారుపడిపోయాడు, భయంతో !

"సిద్దూ ! నాకు అమ్మలేదు. నాన్న లేడు. నిన్ను ఎవ్వరు ఏమి అనరులే!" సుజాత గౌనుతో రక్తాన్ని తుడిచేసుకుంటూ అంది, నెప్పిని ఓర్చుకుంటూ

"అయ్యో ! నిజంగానా !"

సిద్ధూ లేత మనస్సు తన పట్ల జాలితో నిండిపోయింది !

"నిజం ! మా అమ్మా వాళ్ళు అందుకేగా ఇక్కడికి తీసుకొచ్చి మా ఇంట్లో పెట్టుకుని చదివిస్తున్నారు !" శిల్ప గొప్పగా అంది.

వాళ్లిద్దరు కలిసి పక్క ఇంట్లోకి వెళుతుంటే సుజాత వంక దిగులుగా చూస్తుండిపోయాడు సిద్ధూ !

✿ ✿ ✿

మర్నాడు స్కూలు నుంచి రాగానే సుజాతని తన గదిలోకి తీసుకువెళ్లాడు సిద్ధూ !

"సుజాత ! ఇదిగో, ఇవన్ని నా బొమ్మలే ! అన్ని తీసుకుని ఎప్పుడు కావాలంటే అప్పుడు ఆడుకో ! సరేనా ! నీకేం కావాలన్నా నన్ను అడుగు ! ఇదిగో ఇందులో నా డబ్బులుంటాయి ? ఎప్పుడు కావాలన్నా తీసుకుని ఏం కావాలన్నా కొనుక్కో ! ఏం? నెప్పి తగ్గిందా ఇలా. రా మందు రాస్తాను!" అంటూ సుజాతను మంచం మీద కూర్చోబెట్టి మందు వ్రాసాడు నుదుటిమీద !

"అబ్బా ! నెప్పి !" కళ్లల్లో నీళ్లు వచ్చాయి సుజాతకి !

"ఎప్పుడు ఏడవకూడదు నువ్వు !" సిద్ధు కన్నీళ్లు తుడుస్తూ అన్నాడు, ఆరిందాగా ! ఆ చిన్న వయసులోనే సుజాతకి అన్ని విధాలుగా తనే అండగా ఉండాలన్న భావం ఏర్పడింది సిద్ధార్థలో !


అలా చిన్నతనంలో మొదలైన వాళ్ల స్నేహం ఇరుగు పొరుగు ఇళ్లు కావడంతో మరింత బలపడి గట్టిగా పెనవేసుకుపోయింది.

✿ ✿ ✿

సుజాత చదువులోఎప్పుడు ఫస్టే కావడంతో ఎప్పటికప్పుడు స్కాలర్‌షిప్పులు తెచ్చుకుని నెమ్మదిగా ఇంజనీరింగు పూర్తి చేసింది. సిద్ధుకి మంచి జాబ్ వచ్చి ఢిల్లీ వెళ్ళిపోయాడు. శిల్ప వాళ్ల నాన్నకు గుండె పోటు రావడంతో ఇంటిఖర్చులు పెరిగి వాళ్లకు సుజాత చదువు తలకు మించిన భారం అయ్యింది. సుజాతకి ఈ గండం ఎలా గట్టెక్కాలో అర్థం కాలేదు!

"సిద్ధూ !" మామయ్యకు అస్సలు బాగోలేదు! ఈ సారి పరీక్షలు ఎలా వ్రాస్తానో ? ఫీజు కట్టడం కూడా కష్టమేమో ?" సుజాత ఫోను కబురు వినగానే తెల్లవారే ఫ్లైట్‌లో వచ్చేసాడు సిద్ధు ! రాగానే ఇంట్లో సూట్‌కేస్ పడేసి పక్క ఇంటికి పరుగు తీస్తున్న కొడుకుని చూసి ఆలోచనలో పడింది అతని తల్లి విజయ.

✿ ✿ ✿




శ్రీమతి కె.వాసవదత్త రమణ

"సుజి ! దా ! కాలేజికి వెళదాం !" బైక్ ఎక్కించుకుని కాలేజికి తీసుకెళ్లి ఫీజులన్నీ కట్టేసి, ఆమె చేతుల్లో కొంతడబ్బు ఉంచుతూ "సుజి ! నేనున్నాను! నువ్వెప్పుడు అది మర్చిపోకు" అన్నాడు సిద్ధూ ! అతని అభిమానానికి ఆమెకు నోట మాట రాలేదు ! కళ్ళల్లో నీళ్లు తిరుగుతుండగా,

"సిద్ధూ ! పట్టెడన్నం ఎవరయినా జాలిపడి పెడతారు. కొండంత ధైర్యాన్ని, ఓదార్పుని ఇచ్చి దేముడిలా అండగా ఉన్నావు ! నీ రుణం ఏమిచ్చి తీర్చుకోగలను !" ఉద్వేగంగా అంది కదిలిపోతూ.

"సుజి ! నీకు ఏం చేసినా అది నాకు చేసుకున్నట్టే?" ఆమె కళ్లలోకి చూస్తూ అన్నాడు సిద్ధు! ఆ మాటలకు అర్థాలు వెతుకుతూ ఆమె మనసు ఊగిసలాడింది.

✿ ✿ ✿

"సిద్ధూ ! నాన్నకు, నాకు కూడా ఇష్టమే ! శిల్పకు, నీకు పెళ్లి చేద్దామని అనుకుంటున్నాం?" తల్లి మాటలకు అన్నం తింటున్న వాడల్లా సిద్ధార్థ చివ్వున తలెత్తి చూసాడు. ఆవిడ కొడుకు వంక చూడకుండా "చిన్నప్పట్నుంచి అనుకుంటున్న సంబంధం ! మరి ఇప్పుడు "నీ" ఇష్టం ఎలా ఉందో? "నీ" వత్తి పలుకుతూ అందావిడ !

"నాకు కొంచెం టైం కావాలి, నేను ఆలోచించుకోవాలి" చేయి కడుక్కుని లేచాడు, చటుక్కున!

"అదేమిటి ! అన్నం తినకుండా !" ఆవిడ మాటలు పూర్తి కాకుండానే గబగబా చెప్పులు వేసుకుని బయటకు వెళ్ళిపోయాడు.

"చూసారా ! పెళ్లి అనగానే మళ్లీ సుజాత దగ్గరకు వెళుతున్నాడు. ఈ మధ్యన వీడి పద్ధతేం బాగోలేదు?" ఆవిడ కోపంగా అంది? భర్తతో !

"విజయా ! ఇప్పుడే కదా చెప్పావు ! వాణ్ని కొంచెం ఆలోచించుకోని ? అయినా వీడి పద్ధతి ఇప్పుడెందుకు నీకు నచ్చడంలేదు చెప్పు? వీడితో శిల్ప, సుజాత చిన్నప్పట్నుంచి కలసి పెరిగారు ! ఎన్నోసార్లు రాత్రిళ్లు కూడా వాళ్లింట్లో వాడు ఉండిపోలేదూ, మరిప్పుడు నువ్వెందుకు తేడాగా ఆలోచిస్తున్నావ్ ?" మందలించారు రావుగారు భార్యని !

✿ ✿ ✿

"సుజి ! నీతో మాట్లాడాలి !" సీరియస్‌గా అన్నాడు సిద్ధార్థ.

ఆశ్చర్యంగా అతని వంక చూసింది సుజాత!

"అమ్మా వాళ్లు, శిల్పతో నా పెళ్లికి ఇష్టపడుతున్నారు !"

మేడమీద గదిలో చదువుకుంటున్న ఆమె ఎదురుగా కుర్చీ లాక్కుని కూర్చుంటూ అన్నాడు సిద్ధు!

"గుడ్ ప్రపోజల్ !" చిన్నగా నవ్వింది సుజాత!

"నో జోక్స్ ! బి సీరియస్ సుజా !" నాకు ముందు క్లియర్‌గా చెప్పు ?

"నా మీద నీ అభిప్రాయం ఏమిటి?" సూటిగా అడిగాడతను.

సుజాత చటుక్కున లేచి కిటికి దగ్గరకు వెళ్లి నిలబడింది. కిటికీలోంచి వెన్నెల సన్నగా ఆమె ముఖం మీద పడుతుంది. అలల్లా వచ్చే గాలికి ఆమె ముంగురులు చిన్నగా కదులుతుంటే కనురెప్పలార్పకుండా అల్లాగే ఆమెవంక చూస్తుండిపోయాడు సిద్ధు !

"సుజి, మాట్లాడవేం చెప్పు ? ఒక్కసారి ఇటు చూడు?" ఆమెను తనవంక తిప్పుకుంటూ అడిగాడు, "నువ్వు ఏది దాచకుండా, నిజం చెప్పాలి ప్రామిస్ !"

"సిద్ధూ ! నువ్వు నాకు హితుడివి, ఫ్రెండ్‌వి!" కళ్ళు దించుకుని చెప్పింది.

"అంతేనా, ఇంకేమి కానా?" నిరాశగా అన్నాడు.

"ఇప్పుడీ మలుపులో, మనం ఇంతకన్నా ఎక్కువ మాట్లాడుకోవటం అనవసరం సిద్ధూ !

"శిల్పతో నా పెళ్లి ఇంకా అయిపోలేదు సుజీ, జస్ట్ మాటలు ! అంతే"

"మాటలన్నీ నిజమవ్వాలి సిద్ధు, అదే నేను కోరుకొనేది !"

"నేను అబద్ధం చేయాలనుకుంటే?" అర్థోక్తిగా ఆపాదతను.

ఫక్కుమని నవ్వేసింది సుజాత !

"నా పిచ్చి సిద్ధు ! జీవితం అంటే పూల పాన్పు కాదు. ఎన్నో అగాధాలు, ఎన్నెన్నో అవాంత రాలు – వాటిని ఫేస్ చేయడానికి బోలెడంత ధైర్యం కావాలి !"

"అంటే నాకంత ధైర్యం లేదంటావా?"

"సిద్ధూ !" ఆమె మాటల్ని తడుముకుంటూ ఆగింది.

ఇష్టం లేదా, చెప్పు నీ అభ్యంతరం ఏమిటి? నిజం చెప్పు" హర్టయినట్టుగా ఆవేశంగా అన్నాడు.

"సిద్ధు ! మీ వాళ్ళకు నువ్వు ఒక్కడే కొడుకువి! వాళ్ల ఆశలన్ని నీ జీవితం మీదే పెట్టుకున్నారు ! మరి నేను – చిన్నప్పుడే అందరిని పోగొట్టుకున్న దురదృష్టవంతురాలిని, మళ్లీ అదే స్థితిలో నిన్ను మళ్లి నేను ఊహించలేను ! ఓ ఊరును నిలబెట్టడానికి కుటుంబాన్ని త్యాగం చేసినా ఫరవాలేదు. ఓ కుటుంబాన్ని నిలబెట్టుకోవడానికి ఓ వ్యక్తిని దూరం చేసుకున్నా బాధపడకూడదు !"

"సుజీ ! అమ్మావాళ్లని నేను ఒప్పిస్తాను !" ఆశగా అన్నాడతను.

"సిద్ధూ నన్ను మరిచిపో !"

సుజాత మనసులో పెనుతుఫానులు వీస్తున్నా అదిమి పెట్టుకుంటూ స్థిరంగా అంది. "సుజి ! అంతేనా" విలవిలలాడుతూ అన్నాడు సిద్ధార్థ !

"అంతే !" ఇక ఎంత ప్రయత్నించినా ఆమెను ఒప్పించలేక,తన మనస్సును మభ్య పెట్టుకోలేక

## ఐ.ఎస్.బి.కి అంతర్జాతీయ గుర్తింపు

హైదరాబాద్‌లోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బి)కి ప్రపంచంలోని 100 అత్యున్నత బిజినెస్ స్కూల్స్ జాబితాలో 20వ స్థానం లభించింది. ఈ జాబితాను లండన్‌కు చెందిన ప్రతిష్ఠాత్మక ఫైనాన్షియల్ టైమ్స్ పత్రిక రూపొందించింది. ఇప్పటివరకు ఐఐఎంలతో సహా భారతదేశానికి చెందిన ఏ బిజినెస్ స్కూల్‌కు ఈ గౌరవం లభించలేదు. ఈ స్కూల్ స్థాపించి కేవలం ఆరేళ్ళు మాత్రమే అయ్యింది.

"నామీద నమ్మకం లేదా సుజి" అన్నాడు సిద్ధార్థ !

"ఇక్కడ నమ్మకం కాదు ప్రధానం, మనకు పదిమందితో ఉన్న అనుబంధం ! కొన్ని ఇష్టమైనవి పొందాలంటే చాలా వాటిని మనం కోల్పోవాల్సి ఉంటుంది !" అస్థిరంగా కదులుతూ అందామె !

"సుజి ! నేను ఎదురీదడానికి సిద్ధంగా ఉన్నాను, నువ్వునాకు జీవితాంతం తోడుగా ఉంటా నంటే!" ఆమె భుజాల మీద చేయి వేసి తన వైపు తిప్పుకుంటూ ఆమె కళ్ళల్లోకి చూస్తూ అన్నాడు సిద్ధార్థ!

అతని కళ్లలో తనపట్ల నిండుగా ప్రవహిస్తున్న ప్రేమను గుర్తించిన సుజాత "సిద్ధూ ! మనం ఊరికే గాలిలో మాటలు మాట్లాడుకుంటున్నాం. ఈ విషయం ఇంతటితో వదిలేయ్?" అతని చేతులు తీసివేస్తూ అంది తేలిగ్గా !

"సుజి ! నా మీద ప్రేమ లేదా, నేనంటే

నలిగిపోయాడు సిద్ధార్థ !

మళ్లి నెలకు సిద్ధు, శిల్పల పెళ్లి వైభవంగా జరిగింది. సుజాత పెళ్లిలో చాలా ఉత్సాహంగా అందరి తల్లో నాలుకలా తిరిగింది. సిద్ధార్థ మటుకు అభావంగా, డల్‌గా ఉన్నాడు.

ఢిల్లీకి వెళ్లిపోతూ "సుజాత ! చిన్నప్పట్నుంచి నేను సిద్ధూకి పెళ్లాన్నే అన్న భావనతోటే పెరిగాను. నేను కావాలని, ఎవరికి అన్యాయం చేయలేదు" రెండు చేతులు పట్టుకుని కన్నీళ్లతో అంది శిల్ప ! ఆ మాటలకు కదిలిపోయింది సుజాత.

"ఛ ! శిల్ప ! నీ సంగతి నాకు తెలియదా?"

"వద్దు. అలాంటిఊహలేం నువ్వు మనస్సులో పెట్టుకోకు. సిద్ధుని నిజాయితీగా నువ్వు ప్రేమించావు అందుకే అతను నీకే దక్కాడు శిల్పా ! యూ ఆర్ వెరీలక్కీ !" అంది సుజాత. ఎందుకో ఆమె మనస్సు హఠాత్తుగా బరువెక్కింది.

"కాని ఏమో సిద్ధు !" నిరాశగా అంది శిల్ప!

"సిద్ధూ ఎప్పటికి నీ వాడే !" సుజాత కళ్ళలో నీళ్లు తుడుచుకుంటూ అక్కడ్నుంచి గబగబా వెళ్ళిపోయింది. ఎప్పట్నుంచో గుండెల్లో దాగిన వేదనంతా కన్నీళ్లరూపంలో తోసుకు వచ్చింది ఆమెకు! ఆ క్షణంలో ! మంచంమీద పడుకుని భోరుమంది !

"ఇప్పుడు ఏడ్చి లాభం ఉందా!" గుమ్మం మీద రెండుచేతులు ఆన్చి నిలబడి అన్నాడు సిద్ధు వెనుకగా వచ్చి !

"సిద్ధూ ! నువ్వా !" తడబడుతూ లేచింది, మంచంమీద నుంచి !

"నీ ప్రేమను మనసులో దాచుకుని నన్ను దూరం చేసుకుని నువ్వేం సాధించావు? ఇటు నాకు గుండెకోతను మిగిల్చావు? అటు నువ్వు గుండె పగిలేలా ఏడుస్తున్నావు? ఎందుకు ఎందుకిలా చేసావు? అంతా నీకు నచ్చినట్టే జరిగింది ! అయినా నువ్వు సంతోషంగా ఉన్నావా ? చెప్పు?" నాకేసి చూసి నిజం చెప్పు?" ఆవేశంగా అన్నాడతను ! సుజాత కళ్లు తుడుచుకుంటూ తల పక్కకి తిప్పుకుంది

ఆమెను తనవైపు తిప్పుకుని, ఆమె కళ్లలోకి లోతుగా చూసాడు సిద్ధార్థ !

తెల్లటి లాల్చీ, పైజామాలో పెళ్లిబొట్టుతో అందంగా ఉన్న అతని ముఖం వంక ఒక్క క్షణం మళ్లీ చూడలేనేమో అన్నట్టు చూసింది సుజాత.

"పిచ్చి సుజీ ! నీకేం కావాలో నీకు తెలియదు? చిన్నప్పట్నుంచి నీకు అన్నీ నేనే ఇచ్చేవాడిని. ఇప్పుడు అదే చేయాల్సింది!"

నేనెంత పొరపాటు చేసానో నాకిప్పుడు తెలుస్తోంది?" ఆవేదనగా అన్నాడు.

"సిద్ధు ! నువ్వేం ఇచ్చినా అన్ని ఆనందంగా తీసుకున్నాను. ఇప్పుడు ఈ బాధను సంతోషంగానే తీసుకుంటున్నాను !" భోరుమంది సుజాత, అతన్ని హత్తుకుపోయి !

సిద్ధార్థ అలాగే డోలాయమానంగా నిలబడి పోయాడు.

"అవును తనే తప్పు చేసాడు ! ఇటు తల్లి దండ్రులకు ఎదురు చెప్పలేకపోయాడు. శిల్పను బాధపెట్టలేక సుజాతను కావాలని చెప్పలేక ఇద్దరిలో ఎవరో తేల్చుకోలేక ధైర్యంగా నిలబడలేకపోయాడు. నా పిరికితనమే ముగ్గురి జీవితాలని బలి తీసుకుంది!" అనుకుంటూ కుమిలిపోయాడు సిద్ధార్థ !

✿ ✿ ✿

సుజాతకు ఉద్యోగం రావడంతో కలకత్తా వెళ్లిపోయింది. శిల్ప వాళ్ల నాన్నగారు పోవడంతో వాళ్ల అమ్మగారు ఒక్కత్తే ఉండలేక మద్రాసులో ఉన్న తన అన్నగారింటికి వెళ్లిపోయింది ! సుజాత కావాలనే అందరి జీవితాల్లోంచి శాశ్వతంగా తప్పుకుంది. మళ్లీ

ఇన్నాళ్ళకు ఇలా హఠాత్తుగా ట్రైను ప్రయాణంలో కలిసిన సిద్దార్థను చూసి తన కళ్లను తానే నమ్మలేక పోయింది సుజాత ! అతని పరిస్థితి అలాగేఉంది !

✿ ✿ ✿

"సుజి ! ఎందుకు వెళ్లిపోయావు అలా హఠాత్తుగా? నువ్వు వెళ్లిపోయాక నీ లోటు తెలిసింది. వెల్తి మిగిలింది. నా దాహం తీరనిదని తెలిసినా పిచ్చివాడిలా నీ కోసం వెదికాను" రెండు చేతుల్లోనూ ముఖం దాచుకున్నాడు సిద్ధార్థ. సుజాత తన మనస్సులో పొంగిపోతున్న ప్రేమ పరవళ్లను అదిమిపెడుతూ, కర్తవ్యం ఆలోచించింది.

"సిద్దూ !" మృదువుగా పిలిచింది సుజాత ! "మనం ప్రేమికులం కాదు, పెళ్లి చేసుకుందామని కలలు కనలేదు. కలిసి పెరిగాం, తిరిగాము అంతే నువ్వు నిజంగా నన్ను ప్రేమించలేదు ప్రేమించి ఉంటే మనం విడిపోయే వాళ్లము కాదు!" అయినా ఇప్పుడెందుకింకా గతం తలపోస్తున్నావు చెప్పు?

"సుజి !" ఆశ్చర్యంగా చూసాడు ఆమె వంక తడిసిన కళ్లతో !

"నిజం సిద్ధు ! నువ్వు ఒక భ్రాంతిలో ఉన్నావు ప్రేమించానన్న భ్రమలో ఉన్నావు. అంతే!"

"సుజి ! నీ జ్ఞాపకాలు, నీతో గడిపిన ప్రతిక్షణం గుర్తుకు వచ్చి పిచ్చివాడిని చేస్తున్నాయి. అటు అమ్మ వాళ్లకి ధైర్యంగా నా ప్రేమ చెప్పలేక నిన్ను కోల్పోయానన్న బాధ నన్ను కృంగదీస్తోంది. నీకు అన్యాయం చేసి నాకు సుఖం లేకుండా చేసుకున్న మూర్ఖుడ్ని నేను" ఇటు శిల్పను సుఖపెట్టలేక నరక యాతన అనుభవిస్తున్నాను!"

"సిద్ధు ! మనం టీనేజిలో లేము ! పెళ్లి చేసుకుంటే మనం ఎలా ఉండేవాళ్ళమో ? అది వేరే విషయం. కొంచెం మెచ్యూరిటీతో ఆలోచించు నన్ను చూడు, నేను బాగానే ఉన్నాను కదా మరి నువ్వెందుకు గిల్టీ ఫీలవుతున్నావు?" చెప్పు. పెళ్లి చేసుకోకపోతే మటుకు మనమధ్యన ఉన్న ప్రేమ అంతా ఆవిరై పోతుందా?" కన్విన్సింగ్‌గా అంది,

"సుజి ! నా లైఫ్ ఏంటో నాకేం అర్థం కావడం లేదు ! నా మనసుకేం కావాలో తెలియటం లేదు !" భారంగా అన్నాడతను !

తెల్లగా, పొడవుగా ఆరు అడుగులు ఎత్తున్న సిద్ధు ఆ క్షణానికి సుజాతకి చిన్న పిల్లవాడిలా అనిపించాడు.

చిన్నగా తల నిమిరి, "పిచ్చి సిద్ధు ! నువ్వింకా అప్పటి సిద్దూవే, ఏమి మార్పులేదు !" అంటూ చిన్నగా నవ్వింది !

"ఆహా పెద్ద నువ్వు మారావు చాలా ? ఇన్ని చెప్పావు కాని అనలు నువ్వు పెళ్లి చేసుకున్నావా?" అది చెప్పు? అతని కళ్లు ఆసక్తిగా. ఆమె వంక చూసాయి" సమాధానం చెప్పు!" మళ్లీ అతనే అన్నాడు

సుజాత, మనస్సును గట్టి చేసుకుని "నాకింకా పెళ్లి కాలేదని ఎలా అనుకుంటున్నావు సిద్ధు?" పరిహాసంగా అంది, నవ్వుతూ !

అతని ముఖంలో ముందుగా కలవరం, వెంటనే పెద్ద రిలీఫ్ కనిపించింది. "నిజంగా!" అపనమ్మకంగా అన్నాడు. "ఎవరతను?" ఏం చేస్తుంటాడు?" అతని ప్రశ్నల వర్షానికి తట్టుకోలేక "సస్పెన్స్" అంది చటుక్కున "అలా అంటే ఊరుకోను. అయినా నిన్ను తీసుకెళ్ళడానికి స్టేషనుకు వస్తాడుగా! అప్పుడు చూస్తానులే కాని !"

"సరలే ముందు ఏమి ఆలోచించకుండా హాయిగా పడుకో ! అంది సుజాత

రాత్రంతా సుజాతకు నిద్ర పట్టలేదు అలాగే గతంతో పోరాడి అలిసి ఎప్పటికో పడుకుంది.

తెల్లారి లేచిన సిద్దార్ధకి, ముద్దుగా పడుకున్న సుజాత వంక అలాగే చూస్తుండిపోయాడు.

"సుజి, రత్నంలాంటి నిన్ను చేజార్చుకున్న దురదృష్టవంతుడిని నేను !" అనుకున్నాడు బాధగా తనలో !

✿ ✿ ✿

"సిద్దూ ! బై" ట్రైను ఆగగానే భారంగా అంది సుజాత, వీడ్కోలు చెబుతూ,

"సుజి, కనీసం అడ్రసు అయినా ఇవ్వవా?" దీనంగా అడిగాడు.

"వద్దు సిద్ధు ! మళ్లీ ఇలాగే ఎప్పుడో కలుస్తాంలే !" మనజీవితాలు సమాంతర పట్టాలు ! ఎప్పటికి దగ్గరవ్వవు ! కాని ఒకళ్ళ కోసం ఒకళ్ళం నిరంతరం తపిస్తూనే ఉంటాము!"

ఇంతలో సుధాకర్ గబగబా కంపార్టుమెంటు ఎక్కి సుజాత సామాను అందుకున్నాడు.

"సుజి, మీ వారా ?" సిద్దార్థ ఆశ్చర్యంగా అన్నాడు.

"ఆ...... కాదు, ఆ..... అవును!" తడబడుతూ అంది!

"సిద్ధు, మీట్ మై హస్బెండ్ సుధాకర్ !

సుధా, హి యిజ్ సిద్దార్థ, "మై గైడ్ అండ్ మై గాడ్!" అంటూ పరిచయం చేసింది, పెదాల్ని చిరునవ్వు పులుముకుంటూ !

చివరి మాటలంటుంటే ఆమెకళ్లు చెమర్చాయి.

సుధాకర్, మొదట ఆమె చేసిన పరిచయానికి తెల్లబోయాడు. అయినా నాలుగేళ్ల నుంచి ఆమె కింద పని చేస్తున్న ఉద్యోగి అతను ! గబగబా అర్థం చేసుకుంటూ వెంటనే సర్దుకుని,

"గ్లాడ్ టు మీట్ యు మిస్టర్ సిద్దార్థ !" అంటూ చేయి కలిపాడు.

"సుధాకర్‌గారు, సుజాతని భార్యగా పొందిన మీరు చాలా అదృష్టవంతులు !" మనస్ఫూర్తిగా అన్నాడు సిద్ధు, మెరిసే కళ్లతో సుజాత వంక చూస్తూ!

సుజాత ఇబ్బందిగా కదిలింది.

ఫ్లాట్‌ఫారం మీదకు రాగానే, "సుధాకర్‌గారు, "సుజాత నన్ను దేముడంది కాని తప్పు, ఆమే ఎంతో త్యాగం చేసిన దేవత ! అండ్ విత్ యువర్ పర్మిషన్" అంటూ సుజాత రెండు చేతులు దగ్గరగా తీసుకుని, "నువ్వెన్ని చెప్పినా, నా తప్పు నా మనసుకి తెలుసు! నేను పిరికివాడిని, ప్లీజ్ ఫర్‌గివ్ మీ !" అన్నాడు చేతుల్ని తన కళ్లకు ఆనించుకుంటూ !

సుజాత ఇక దుఃఖాన్ని ఆపుకోలేకపోయింది.

ట్రైను కదిలింది, "బై" అంటూ పరుగెత్తు కుంటూ ఎక్కేసాడు, సిద్దార్థ !

అతని కంటతడి ఆమె చేతులపై మెరుస్తూ ఆమె మనసులో మంటలు రేపుతుంది. కనుమరు గవుతున్న అతని రూపం ఆమె కంటి తడిలో మసక బారుతోంది.

"మేడమ్ ! వెళదామా !" సుధాకర్ నెమ్మదిగా అన్నాడు, వెనకగా !

"ఆ.... పదండి !" సుజాత కళ్లు తుడుచు కుంటూ అంది. దోవలో కారులో "సారీ సుధాకర్ ! నా పర్సనల్ లైఫ్‌లోకి మిమ్మల్ని లాగి చాలా ఇబ్బంది పెట్టాను !" అంది.

"ఫరవాలేదు మేడమ్" అన్నాడు.

"సుధాకర్, ప్రేమించిన వాళ్లను బాధపెట్టే శక్తి ఆ దేముడు నాకివ్వలేదు" అదినా బలహీనతేమో!" ఆవేదనగా అంది.

సుధాకర్ ఏమి మాట్లాడలేదు.

" ఏ భయమో, వ్యసనమో బలహీనత కానక్కర్లేదు ! ఒకరి పట్ల వెర్రిప్రేమ, పిచ్చి అభిమానం కూడా ఓ బలహీనతే !"

తనలో తాను అనుకున్నట్టుగా అంది సుజాత.

ఒక్క నిముషం ఆగి, ఆమె వంక చూసి,

"నేనీ విషయాన్ని ఇక్కడే మర్చిపోతున్నాను మేడమ్!" నెమ్మదిగా అన్నాడతను.

"మీ సంస్కారానికి థాంక్స్ సుధాకర్ ! నిజానికి మీకు తెలియకుండానే మరో జీవితంలో తిరిగి వసంతం రావడానికి పరోక్షంగా సహాయ పడ్డారు !"

ఆశ్చర్యంగా చూసాడతను !

"మనం ప్రేమించేవాళ్ల ఆనందం కన్నా ఇంకేం కావాలి !"

కళ్ళు మూసుకుని సీటులో వెనక్కి వాలుతూ అందిసుజాత సంతృప్తిగా !

కారు రివ్వున ముందుకు దూసుకు వెళుతోంది, కాలం లాగా !